
సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం | 16 | డిసెంబర్ | 2023



అధికారుల నిర్లక్ష్యం!
గోపల్‌దిన్నె రిజర్వాయర్ గేట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకోవడం లేదు.
వివరాలు 8లో ▸



అయోధ్య టు శ్రీలంక
మాజీ సైనికులు అయోధ్య నుంచి శ్రీలంకకు సైకిల్ యాత్ర చేపట్టారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.3/17.4
ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇద్దరు అడిషనల్ కలెక్టర్ల నియామకం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఇద్దరు స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఏఎస్ 2021 బ్యాచ్‌కు చెందిన శివేంద్ర ప్రతాప్‌ను, వనపర్తి జిల్లాకు సంచిత్ గంగ్వార్‌ను నియమిస్తూ శుక్రవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే వీరిద్దరూ విధుల్లో చేరనున్నారు. కాగా, ఇప్పటివరకు మహబూబ్‌నగర్‌కు స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్‌గా డీఆర్‌డీఓ యాదయ్య, వనపర్తికి రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు వ్యవహరించారు.

రేపు జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కామారెడ్డిలో ఈనెల 23న జరిగే రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పరుగు పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలను ఈనెల 17న జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–16 బాలురు, బాలికలకు 2కేఎం, అండర్–18 విభాగం బాలురకు 6 కేఎం, బాలికలకు 4కేఎం, అండర్–20 జూనియర్ పురుషులకు 8 కేఎం, జూనియర్ మహిళలకు 6 కేఎం, పురుషులు, మహిళలకు 10 కేఎం పరుగు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఆసక్తిగల క్రీడాకారులు ఎస్ఎస్‌సీ మెమో, తహసీల్దార్ ద్వారా జారీ చేసిన కులధ్రువపత్రంతో అథ్లెటిక్స్ కోచ్‌లు ఆనంద్, సునీల్‌కు రిపోర్టు చేయాలని కోరారు. మిగతా వివరాల కోసం 9440656162, 9849706360 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

యాసంగి పంటల సాగుపై అవగాహన

మహబూబ్‌నగర్ రూరల్: యాసంగి పంటల సాగుపై ఏటిలు, ఏఈఓలకు శనివారం మండల పరిధిలోని ధర్మాపూర్‌లోని రైతువేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. వరి కోతల అనంతరం రైతులు తమ పొలాల్లో జీరో టిల్లేజి మొక్కజొన్నను విత్తుకోవచ్చని, బరువైన, తేమను నిలుపుకునే నేలలు అనుకూలమని తెలిపారు. వరి కోసిన తర్వాత తేమ లేనటువంటి పరిస్థితుల్లో తేలికపాటి తడి ఇచ్చి మొక్కజొన్నను విత్తుకోవాలని, 60 ఇన్‌టు 20 సీఎం ఎడంతో విత్తుకోవాలన్నారు.

ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని భవిత సెంటర్‌లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 9110359755 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి



పాలమూరు: ఈనెల 30న నిర్వహించే లోక్ అదాలత్ కోసం ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి కేసులు గుర్తించి, కక్షిదారులకు సమాచారం చెప్పాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ బి.పాపిరెడ్డి అన్నారు. లోక్ అదాలత్‌పై జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌తో పాటు ఇతర సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలాన్, డ్రంకన్ డ్రైవ్, ఎంవీఐ యాక్ట్ కేసులు, ఈ–పెట్టీ కేసులు, భూతగాదా, ఇతర సివిల్ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు. బీమా కంపెనీలకు సంబంధించి ఉన్న కేసులకు స్టాండింగ్ కౌన్సిల్ అవసరం అయిన సూచనలు పాటించి కేసులు పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ విజయవంతం కావాలంటే పోలీసులు ప్రత్యేక చొరవ చూపించాలని, కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

పెండింగ్‌పై నజర్

- ఎన్నికల నేపథ్యంలో ముందుకు కదలని 'ధరణి' ఫైళ్లు
- పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశం
- జిల్లావ్యాప్తంగా 3,072 దరఖాస్తుల పెండింగ్
- తహసీల్దార్ల వద్ద 2,589, కలెక్టరేట్‌లో 483



అర్బన్ తహసీల్ కార్యాలయంలో పెండింగ్ ధరణి ఫైళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాధాకృష్ణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ రకాల మాడ్యూల్స్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా రెండు నెలలుగా ధరణి దరఖాస్తులకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలలేదు. దీంతో మీసేవ కేంద్రాల ద్వారా చేసుకున్న దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉండటంతో వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎక్కువ రోజులుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయల్లో అధికారులు వాటిపై తలమునకలయ్యారు.

తహసీల్దార్ లాగిన్‌లో అధికంగా..

ధరణి పెండింగ్ ఫైళ్లతో పాటు ఇతర వివిధ పనులు సైతం రెవెన్యూ యంత్రాంగాన్ని కంటి మీద కునుకు లేకుండాచేస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్ల పెండింగ్‌కు సిబ్బంది కొరత కూడా ఓ కారణమేనని చెప్పవచ్చు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో కసరత్తును ప్రారంభించారు. వాస్తవికత ఆధారంగా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

■ ధరణిలో వివిధ రకాల మాడ్యూల్స్ కింద పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు కుప్పలుగా ఉన్నాయి. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 3,072 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్ల లాగిన్‌లో 2,589 ఉండగా, కలెక్టర్ లాగిన్‌లో 483 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అందులో ధరణి మాడ్యూల్స్ మ్యుటేషన్ కోసం 336, డాటా కరెక్షన్ కోసం 1,520, సక్సెషన్ కోసం 150, కోర్టు కేసులకు సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం 65 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలి



శాసనసభ ఎన్నికల కారణంగా పెండింగ్‌లో ఉన్న ధరణి, ఇతర అంశాలపై దృష్టి సారించి క్లియర్ చేయాలని సూచించాం. ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటం కారణంగా ఫైళ్ల పరిష్కారం ఆలస్యమైంది. వెంటనే క్లియర్ చేయాలని ఆయా మండలాల తహసీల్దార్‌లకు ఆదేశాలిచ్చాం.

– అనిల్‌కుమార్, ఆర్డీఓ, మహబూబ్‌నగర్

ధరణి కొనసాగింపుపై అనుమానం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ తీసుకు వచ్చి భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు తహసీల్దార్ కార్యాలయాల్లోనే నిర్వహిస్తుండటం తెలిసిందే. తహసీల్దార్లకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించి భూముల లావాదేవీలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలను పూర్తిగా తొలగించి రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తెచ్చారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధరణి ఉంటుందా లేదా అనే అనుమానం ప్రజల్లో కొనసాగుతుంది. ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ పెద్దల నుంచి తెలుస్తోంది. తాజాగా ధరణి పెండింగ్ దరఖాస్తులపై కసరత్తు మొదలు పెట్టడం, అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ శాఖలో సమూల మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది.

వేతన వెతలు

ఐడీలు రాక ఇబ్బందులు పడుతున్న వీఆర్‌ఏలు

- నాలుగు నెలల కిందట వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన ప్రభుత్వం
- నేటికీ జీతాలు రాక ఆర్థికంగా అవస్థలు
- బదిలీలతో ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో సమస్య
- ఉమ్మడి జిల్లాలో 3,056 మంది బాధితులు



ఉమ్మడి జిల్లాలో వీఆర్‌ఏలు

నాగర్‌కర్నూల్	వనపర్తి	మహబూబ్‌నగర్	నారాయణపేట	జోగులాంబ గద్వాల
682	664	656	580	474

కల్వకుర్తి టౌన్: గ్రామ రెవెన్యూ వ్యవస్థ (వీఆర్‌ఏ) రెవెన్యూ విభాగానికి పట్టుగొమ్మ లాంటిది. అలాంటి వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేస్తూ.. ఆ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వంలోని ఇతర శాఖలలో సర్దుబాటు చేశారు. ఇలా చేసిన తర్వాత వీఆర్‌ఏలు తమకు కేటాయించిన విభాగాల్లో చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వారికి గత నాలుగు నెలల నుంచి ఇప్పటికీ జీతాలు అందలేదు. సర్దుబాటు తర్వాత ఎంప్లాయి ఐడీ ఇవ్వకపోవడంతో జీతాలు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివిధ విభాగాల్లో..

వీఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేసిన గత ప్రభుత్వం వారందరినీ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,056 మంది వీఆర్‌ఏలు ఉండగా.. వారి విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించింది. రెవెన్యూ శాఖలో జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా.. మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లతోపాటు వార్డు ఆఫీసర్లుగా.. నీటి పారుదల, మిషన్ భగీరథ శాఖల్లో హెల్పర్లుగా జాయిన్ అయ్యారు. అలాగే 61 ఏళ్లకు పైబడిన వారి కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి సర్దుబాటు చేస్తామని చెప్పింది. అయితే చాలామందికి 61 ఏళ్లు దాటగా.. మరికొందరు కొన్ని నెలల్లో 61 ఏళ్లు నిండేవారు ఉన్నారు. ప్రస్తుతం వీరందరి పరిస్థితి కూడా అగమ్యగోచరంగా తయారైందని వాపోతున్నారు.



మహబూబ్‌నగర్‌లో సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

జనరేట్ కాని ఎంప్లాయి ఐడీ

వీఆర్‌ఏలకు ఎంప్లాయి ఐడీ నమోదైన తర్వాతనే వారిని ఉద్యోగుల కింద లెక్కగట్టి వేతనాల ప్రక్రియ మొదలుపెడతారు. వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో సర్దుబాటు చేసిన గత ప్రభుత్వం వారికి ఇంకా ఐడీ ఇవ్వలేదు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ విషయం మరుగునపడింది. మొత్తంగా నాలుగు నెలలుగా వేతనాలు అందక తాము ఇబ్బందులు పడుతున్నామని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలతో ఊరు కాని ఊరుకు వెళ్లి అప్పులు చేసి మరీ జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. గతంలో రెవెన్యూ విభాగంలో ఉన్న సమయంలో వేతనాలు అందేవని, ఇప్పుడు కనీసం అవి కూడా రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. వీఆర్‌ఏలను సర్దుబాటు చేయక ముందు రెండు నెలల క్రితమే నిరవధిక సమ్మెలోకి వెళ్లడంతో ఆ సమయంలోనూ వేతనాలు రాక చాలా ఇబ్బందులకు గురయ్యామని, ఇప్పుడు నాలుగు నెలలు కలుపుకొని ఆర్నెళ్లకుపైగా వేతనాలు రాలేదని చెబుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి, వేతనాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

అద్దె గదిలో ఉంటున్నా..



నేను కల్వకుర్తి మండలం రఘుపతిపేట వీఆర్‌ఏగా ఉన్నప్పుడు ఊరిలోనే ఉండి అధికారులకు సమాచారం ఇచ్చేవారం. అధికారుల ఆదేశాల మేరకు పని ఉన్న సమయంలోనే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేదాన్ని. ప్రస్తుతం వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు తర్వాత కల్వకుర్తి బాలికల ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌తోపాటు స్వీపర్‌గా పనిచేస్తున్నా. నైట్ వాచ్‌మెన్ డ్యూటీ కూడా వేయడంతో పట్టణంలోనే ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నా. వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నా.

– సాయమ్మ, ఆఫీస్ సబార్డినేట్, విద్యాశాఖ, కల్వకుర్తి

అప్పులు చేసి నెట్టుకొస్తున్నా..



వీఆర్‌ఏలుగా పని చేస్తున్న మమ్మల్ని గత ప్రభుత్వం వివిధ శాఖలలో రెగ్యులర్ ఉద్యోగులుగా సర్దుబాటు చేసినా నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. మాకు కేటాయించిన విభాగం దూరమైనా తప్పక అక్కడికి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నా. అప్పు చేసి అక్కడ ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించి వేతనాలు అందేలా చూడాలి.

– లక్ష్మణ్, హెల్పర్, మిషన్ భగీరథ

అర్థం కాని పరిస్థితి..



కల్వకుర్తి రెవెన్యూ విభాగంలోనే సర్దుబాటులో భాగంగా ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నా. నాకు ఈ ఆర్థిక ఏడాదితో 61 ఏళ్ల సర్వీసు పూర్తవుతుంది. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడంతో నాతోపాటు నా కుటుంబ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. 61 ఏళ్లు నిండిన వారందరి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న అప్పటి ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా మారడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ప్రభుత్వమైనా మా సమస్యను పరిష్కరించాలి.

– పుల్లయ్య, ఆఫీస్ సబార్డినేట్, రెవెన్యూ, కల్వకుర్తి

ప్రభుత్వానిదే నిర్ణయం..



వీఆర్‌ఏల జీతాలకు సంబంధించి అది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. వారి ఉద్యోగాలకు సంబంధించి ఇంకా ఐడీలు క్రియేట్ కాకపోవడం వల్లే జీతాలు రావడం లేదు. వారి సర్దుబాటు తర్వాత ఎన్నికల కోడ్, కోర్టు కేసుల సమస్యలతో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం త్వరలోనే వారి సమస్యకు పరిష్కారం చూపుతుంది.

– సీతారామారావు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), నాగర్‌కర్నూల్

ఆర్థిక పరిస్థితి అధ్వానం



బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వీఆర్‌ఏలకు పే స్కేల్ విషయంలో న్యాయం జరిగినా నేటికీ తమకు ఎంప్లాయి ఐడీలు ఇవ్వలేదు. దీనికి తోడు ఐదు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడిగా చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీసిన వీఆర్‌ఏల కష్టాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తించి వీఆర్‌ఏలను రెవెన్యూతో పాటు వివిధ శాఖల్లో విలీనం చేసింది. కానీ వేతనాలు చెల్లించకపోవడం బాధాకరం. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ఎంప్లాయి ఐడీలు జారీ చేసి పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

– ఎండీ మునీర్, రికార్డు అసిస్టెంట్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

- నేటి నుంచి జనవరి 26వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ వేద్‌వీర్ ఆర్య



మాట్లాడుతున్న కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ వేద్‌వీర్ ఆర్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంతో పాటు కొత్త లబ్ధిదారులను గుర్తింపులో భాగంగా అవగాహన నిమిత్తం ఈ నెల 16 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర రక్షణశాఖ జాయింట్ సెక్రెటరీ వేద్ వీర్ ఆర్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అదనపు కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు మౌలిక వసతులు పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, దీపం కనెక్షన్లు, ఇళ్లు, పౌష్టికాహారం, విద్య, వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులకు ఈ పథకాలు చేరాయా లేదా అని, అలాగే కొత్త లబ్ధిదారులను గుర్తించి వారికి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు ఆరు ప్రచార వాహనాలను కేటాయించామని, ఈ వాహనాలు ప్రతి రోజు రెండు గ్రామాల్లో తిరిగే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన, దీన్ దయాల్ అంత్యోదయ అన్నయోజన, పీఎం ఉజ్వల్ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్ సమ్మాన్, కిసాన్ క్రెడిట్, పోషణ అభియాన్, హర్‌ఘర్ జల్ జీవన్ మిషన్, జన్ ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన.. తదితర పథకాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు విజయవంతం చేసేందుకు సహకారం అందించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహణకు జిల్లాకు నోడల్ అధికారి, మండలాల వారీగా నోడల్ అధికారులను కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం ఈ కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారని, అదే సమయంలో బాలానగర్ మండలం పెద్దాయిపల్లిలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, విద్య, వైద్యం, ఆరోగ్యం, పెట్రోలియం, యువజన సర్వీసులు, మహిళా శిశుసంక్షేమం, సహకార, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆయుష్ గృహ నిర్మాణ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఆర్డీఓ యాదయ్య పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు జీరో టికెట్లు అందజేత



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలకు టిమ్ ద్వారా జారీ చేస్తున్న మహాలక్ష్మి జీరో టికెట్ల జారీ విధానాన్ని శుక్రవారం రీజినల్ మేనేజర్ శ్రీదేవి పరిశీలించారు. అదే విధంగా బస్సుల్లో మహిళల గుర్తింపు కార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిమ్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేశామని, దీంతో మహిళలకు మహాలక్ష్మి జీరో టికెట్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు గుర్తింపు కార్డు వెంట తీసుకువచ్చేలా కండక్టర్లు అవగాహన కల్పించాలని కోరారు. సాధారణ మహిళలతో పాటు బస్సుల్లో ప్రయాణించే ఇతర అన్ని రకాల పాసులు (ఉచిత, రూట్) ఉన్న విద్యార్థులకు, నెలవారీ సీజన్ టికెట్ ఉన్న మహిళలకు, పీహెచ్‌సీ పాసులు ఉన్న మహిళలకు తప్పనిసరిగా జీరో టికెట్ జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం పలువురు మహిళలకు జీరో టికెట్లు అందజేశారు.

వెల్ఫేర్ బోర్డు సభ్యులతో సమావేశం

ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్ఎం శ్రీదేవి రీజియన్‌లోని పలు డిపోలకు చెందిన వెల్ఫేర్ బోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం పకడ్బందీగా అమలయ్యేలా వెల్ఫేర్ బోర్డు సభ్యులు తగిన చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ బాబునాయక్, పీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అమలు తీరుపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు ఉదయమే గ్రామాలకు చేరుకుని క్షేత్రస్థాయిలో ఉండాలని సూచించారు. ఉపాధి హామీ పథకం, శానిటేషన్ వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల నమోదును పెంచాలన్నారు. సమయానికి చెల్లింపులు చేయాలని, మస్టర్ రోల్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పంచాయతీ ఆస్తులు, భవనాల వివరాలను, 10 శాతం లేఅవుట్లతో సహా పూర్తి వివరాలను సేకరించి సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ బిల్లులు అనవసరంగా పెరిగిపోకుండా మోటార్లు వినియోగించాలని, నిర్దేశించిన ప్రకారం విద్యుత్ బిల్లులు చెల్లించాలని సూచించారు. ఇంటి పన్నులపై దృష్టి సారించి నూరుశాతం వసూలు చేయాలన్నారు. జిల్లాలో కేవలం 40 శాతం మాత్రమే పన్ను వసూలు ఉందని, దీన్ని పెంచాలన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని, పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్‌లను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం నర్సరీల ఏర్పాటులో బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు వేయటం వంటి పనులను చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద నాటే ఉద్యాన మొక్కలపై దృష్టి సారించి త్వరితగతిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. డీఆర్డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఎఫ్ఓ సత్యనారాయణ, హార్టికల్చర్ ఏడీ సాయిబాబా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

22న జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 22వ తేదీన జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15–29 ఏళ్ల యువత పోటీల్లో పాల్గొనవచ్చని, దరఖాస్తులను ఈనెల 21లోగా మెయిన్ స్టేడియంలోని జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో అందజేయాలని కోరారు. గ్రూప్‌ల వారీగా, సోలో జానపద నృత్యాల పోటీలు ఉంటాయని, భారతదేశ సంప్రదాయ జానపద నృత్యాలకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రూప్, సోలో జానపద గీతాలు, ఇంగ్లిష్‌లో వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, ఉపన్యాసం, ఫొటోగ్రఫీ పోటీలతో పాటు యువ క్రితీలో హ్యాండిక్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్, ఆగ్రో ఉత్పత్తుల కేటగిరీలో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానానికి ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, మిగతా వివరాల కోసం 9441565895 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీరాంగోల్డ్ ధాన్యం ధర రూ.3,339

దేవరకద్ర: స్థానిక దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో శ్రీరాంగోల్డ్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,339గా ఒకే ధర నమోదైంది. ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర గరిష్టంగా రూ.3,259, కనిష్టంగా రూ.3,223, హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.2,001గా ధరలు లభించాయి. కందుల ధర గరిష్టంగా రూ.9,610గా ధర వచ్చింది.

ఈ నెల చివరి వారంలో సైన్స్ ఫెయిర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు ఈనెల చివరి వారంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. మేరకు ఆర్వీఎం సమావేశ మందిరంలో హెచ్ఎంలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యం, పర్యావరణహిత జీవనం, వ్యవసాయం, కమ్యూనికేషన్, గణనైపుణ్యం తదితర అంశాలపై సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు మంచి ప్రదర్శనలు చేసేటట్లు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

18న లోకకల్యాణం కోసం అయ్యప్ప పడిపూజ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం పాల్కొండలోని వాసవీ గార్డెన్స్‌లో ఈనెల 18వ తేదీన అయ్యప్పపడి పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జ్ఞానజ్యోతి అయ్యప్ప ధర్మప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జె.మనోహర్ శాస్త్రి అన్నారు. జిల్లాకేంద్రం వేపూరిగేరి ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం పడిపూజ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకల్యాణం కోసం అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా కేరళకు చెందిన శబరిమల మూన్‌మేల్ శాంతి సుధీర్ నంబూద్రి ఆధ్వర్యంలో పడి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు గణపతి హోమం, 8 గంటల నుంచి 10.30 గంటల వరకు బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి వేపూరిగేరి ఆంజనేయస్వామి దేవాలయం వరకు అయ్యప్పస్వామి ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు భగవతి సేవ, రాత్రి 7 గంటలకు అయ్యప్ప పూజ, అష్టాభిషేకం, 8 గంటలకు పడిపూజ మహోత్సవం, హరివరాసనం నిర్వహిస్తామని తెలిపారు. ఈ పడిపూజలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు ముత్యం, సీమ నరేందర్, విజయ్‌కుమార్, గుండ వెంకటేశ్, ఎదిరె ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలు

బిజినేపల్లి: మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను రూపొందించాయని, వాటిపై అందరికీ అవగాహన ఉండాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా.మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పాలెం వ్యవసాయ కళాశాలలో మహిళా సాధికారత, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై ఎస్‌ఐ రాములుయాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థినులపై ఎవరైనా లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా. వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.


ప్యాంట్ జేబులో పేలిన సెల్‌ఫోన్

గద్వాల క్రైం: ఓ వ్యక్తి ప్యాంట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ ప్రమాదవశాత్తు పేలిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన జయరాముడు శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయలను కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అయితే తన ప్యాంట్ జేబులో ఉన్న జియో కంపెనీ ఫోన్ ఒక్కసారిగా పేలింది. ప్రమాదంలో సదరు వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చెరువు ఆక్రమణకు యత్నం!

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ మండలం లాల్యానాయక్ తండా చెరువు ఆక్రమణకు గురవుతోంది. కొందరు చెరువులో మట్టిని తవ్వి తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది శుక్రవారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. చెరువు మట్టిని తరలిస్తున్న టిప్పర్, ప్రొక్లెయిన్‌లను స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయంపై తహసీల్దార్ సుందర్‌రాజ్‌ను సంప్రదించగా.. లాల్యానాయక్ తండాలో మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, వెంటనే ఆర్‌ఐ క్రాంతికుమార్‌గౌడ్ అక్కడికి వెళ్లి మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై కేసు నమోదు చేశామని, జరిమానా కోసం మైనింగ్ ఏడీకి రాసినట్లు తెలిపారు.

జోగుళాంబ సన్నిధిలో నటుడు తిరువీర్



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శుక్రవారం సినీనటుడు తిరువీర్ కుటుంబ సమేతంగా దర్శించుకొని చండీహోమంలో పాల్గొన్నారు. అంతకుముందు సంకల్పసిద్ధి గణపతి పూజ, బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అలంపూర్ ఆలయాలు మరింత ప్రచారంలోకి రావాలని, అందుకు తనవంతు సహకరిస్తానని తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం!

- శిథిలావస్థకు చేరిన గోపాల్‌దిన్నె రిజర్వాయర్ ఔట్‌ఫాల్ గేట్లు
- యథేచ్ఛగా తరలుతున్న రక్షణగోడ మట్టి
- సిల్ట్, జమ్ము తొలగించకపోవడంతో చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు



శిథిలావస్థలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ ఔట్‌ఫాల్ గేట్లు

వీపనగండ్ల: గోపల్‌దిన్నె రిజర్వాయర్ ఔట్‌ఫాల్ గేట్లు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొందరు అక్రమార్కులు రిజర్వాయర్ కట్ట మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

30 వేల ఎకరాలకు సాగు నీరు..

ఈ రిజర్వాయర్ ద్వారా వీపనగండ్ల మండలంలోని వీపనగండ్ల, గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి, తూంకుంట,సంపత్‌రావుపల్లి గ్రామాలతో పాటు చిన్నంబావి మండలంలోని వెలగొండ, మియాపూర్, దగడపల్లి, అమ్మాయిపల్లి తదితర గ్రామాల్లోని సుమారు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. సాగు నీరు సరఫరా చేసేందుకు నిర్మించిన ఔట్‌ఫాల్ గేట్లు శిథిలావస్థకు చేరి రక్షణ గోడ కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతోపాటు కట్ట రక్షణకు పోసిన మట్టిని కొందరు కాంట్రాక్టర్లు యథేచ్ఛగా తరలిస్తుండటంతో కట్ట కుంగిపోయే పరిస్థితి ఉంది. సమస్యను పలుమార్లు జూరాల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



రిజర్వాయర్ కట్ట మట్టి తరలించిన అక్రమార్కులు

పూడుకుపోయిన కాల్వలు..

రిజర్వాయర్ మొదట నుంచి చివరి ఆయకట్టు వరకు నిర్మించిన పంట కాల్వల్లో పూడిక తొలగించపోవడంతో సాగునీరు ముందుకు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండూరు సమీపంలోని డి–40 కాల్వకు నీరందక ఏటా చివరి ఆయకట్టు పంటలు ఎండిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కాల్వల్లో పేరుకుపోయిన జమ్ము, సిల్ట్, కాల్వల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ప్రధాన కాల్వ దుస్థితి

నిధులు మంజూరు చేయాలి..



పంట కాల్వల మరమ్మతుకు కొత్త ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలి. లష్కర్లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టి రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

– శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, గోపల్‌దిన్నె

క్షేత్రస్థాయి పరిశీలన జరగాలి..



ప్రధాన కాల్వతో పాటు ఉప కాల్వలు, పంట కాల్వల్లో సిల్ట్, జమ్ము పేరుకుపోవడంతో సాగునీరు సక్రమంగా ముందుకు పారడం లేదు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించాం. ఇప్పటికై నా స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి పనులు చేపట్టకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడుతాం.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

కాల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టేందుకు గుర్తించి నిధుల మంజూరుకు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం. నీరు వృథా చేయకుండా వినియోగించుకుంటే చివరి ఆయకట్టు వరకు అందుతాయి. రైతులు సహకరిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– ప్రభు, ఏఈ, పెబ్బేరు ప్రాజెక్ట్

అదృశ్యమైన బాలికల ఆచూకీ లభ్యం


- నాలుగు మాసాల క్రితం ఇంటినుంచి పారిపోయిన అక్కాచెల్లెళ్లు
- బొమ్మలు విక్రయించే వారి సహాయంతో యాదాద్రి జిల్లా ఆరెగూడెంలో ప్రత్యక్షం
- నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారానికి చెందిన వారిగా గుర్తింపు
- పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

చౌటుప్పల్: నాలుగు మాసాల క్రితం ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలను గుర్తించిన అధికారులు శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదే గ్రామంలో 8వ, 6వ తరగతులు చదువుతున్నారు. వీరు ఈ ఏడాది ఆగస్టు 22న ఇంటి నుంచి పారిపోయారు. ఏడాది క్రితం వీరి తమ్ముడు మృతిచెందాడు. దాంతో తల్లి మానసికంగా కుంగిపోయింది. అదే సమయంలో తండ్రి తాగుడుకు బానిసగా మారాడు. ఈ క్రమంలో అక్కాచెల్లెళ్లు మానసిక వేదనకు గురయ్యారు. చేసేదేమీ లేక ఇంటి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అలా ఇంట్లో నుంచి వచ్చిన వారు అదే రోజున నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నారు. అక్కడ వీధుల్లో తిరుగుతున్న వీరిని బొమ్మలు విక్రయించే ఓ కుటుంబం చేరదీసింది. గ్రామాల్లో సంచరిస్తూ బొమ్మలు అమ్ముకునే వారి వెంటనే వీరు కూడా తిరగసాగారు. అందులో భాగంగా ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చేరుకున్నారు. 15రోజుల క్రితం బొమ్మలు విక్రయించే కుటుంబం బాలికలను ఆరెగూడెంలో విడిచిపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తమ స్వగ్రామానికి వెళ్లిపోయింది. దాంతో ఆరెగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు దంపతులు బాలికలను చేరదీశారు. గ్రామస్తుల సూచన మేరకు శనివారం స్థానికంగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించేందుకు తీసుకెళ్లగా ప్రధానోపాధ్యాయుడు పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు ద్వారా ఆ బాలికలు నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారానికి చెందిన వారుగా గుర్తించి 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. భువనగిరికి చెందిన జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు ఆరెగూడేనికి వెళ్లి బాలికల తల్లిదండ్రులతో పాటు అక్కడి ఎస్‌ఐకి సమాచారం ఇచ్చాడు. బాలికలిద్దరిని బాలరక్ష భవన్‌కు తరలించారు. సాయంత్రం తెలకపల్లి ఎస్‌ఐ సమక్షంలో బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెల ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆగస్టు 22న తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు సైతం నమోదైంది.

దుకాణాల్లో చోరీ

గద్వాల క్రైం: పట్టణ శివారులోని పలు దుకాణాల్లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సామగ్రి ఎత్తుకెళ్లారు. బాధితుల కథనం మేరకు.. గద్వాల–అయిజ రోడ్డులో చిరు వ్యాపారులు హోటళ్లు నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. సుమారు 10 దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి సామగ్రిని అపహరించారు. వీటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని వివరించారు. బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో..



అడ్డాకుల: మూసాపేట మండలం స్ఫూర్తితండాలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన సామ్యానాయక్ కుటుంబం గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి భూత్పూర్ వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు రాత్రి ఇంటికి వేసిన తాళం విరగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న 73 తులాల వెండి, ఒక తులం బంగారు ఉంగరం, రూ.40 వేలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన సామ్యానాయక్ ఇంటికి ఉన్న తాళం విరిగి కనిపించడంతో లోనికి వెళ్లి చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

అయోధ్య టు శ్రీలంక



సైకిల్ యాత్రకు సిద్ధమవుతున్న మాజీ సైనికులు

- మాజీ సైనికుల సైకిల్ యాత్ర..
- ఆరు పదుల వయసులో యువతకు ఆదర్శం

మరికల్: ఆరు పదుల వయసు దాటిన మాజీ సైనికులు 37 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసి, ప్రజలకు మంచి సందేశం ఇవ్వడం కోసం అయోధ్య నుంచి శ్రీలంక వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. శుక్రవారం మరికల్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించే ముందు 'సాక్షి'తో వారు మాట్లాడారు.. ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడాలన్న భావన ప్రజల్లో కలిగించేందుకు ఇప్పటి వరకు వేలాది కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. సైకిల్ తొక్కడంతో శారీరకంగా, సామాజిక పరంగా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు. వారే మహారాష్ట్రలోని నాసిక్ చెందిన శివనారాయణ మిశ్ర, ఉల్లాస్ కులకర్ణి, డాక్టర్ సాయబ్ రావు కాసోట్ సైన్యంలో పని చేసిన వీరు ఆధ్యాత్మిక యాత్ర చేపట్టాలని భావించారు. శ్రీరామ జన్మ భూమి అయోధ్య నుంచి శ్రీలంకలో రావణాసురుడిని వధించిన ప్రాంతం వరకు యాత్ర చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

అయోధ్య నుంచి ప్రారంభం

శ్రీరాముడి పవిత్ర దర్శనాన్ని చేపట్టాలనే ఉద్దేశంతో అయోధ్య నుంచి శ్రీలంక వరకు ముగ్గురం సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాం. ఈ యాత్ర ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వాలనుకున్నాం. ఆరు పదుల వయస్సు వరకు సైకిల్ తొక్కగలం అని తాము నిరూపిస్తున్నాం. ఇప్పటి వరకు తమకు రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు ఏవీ లేవు. శారీరక శ్రమ, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలి.

– డాక్టర్ సాయబ్‌రావ్ కాసోట్, నాసిక్

రోజుకు వంద కిలో మీటర్లు

సైకిల్ యాత్రలో నేను ఒకడిని. నా వయస్సు ప్రస్తుతం 62 ఏళ్లు. రోజుకు 100 నుంచి 120 కిలో మీటర్ల వరకు సైకిల్‌పై ప్రయాణిస్తున్నాం. శారీరకంగా చాలా ఆరోగ్యంగా ఉన్నా. వీలైనంత వరకు సైకిల్ తొక్కడం, కాలినడకతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కూడా కాపాడువచ్చు. ఆధ్యాత్మిక యాత్రను నలుగురికి ఉపయోగపడేలా కొనసాగిస్తున్నాం.

– సుబేదార్ ఉల్లాస్ కులకర్ణి, నాసిక్

సైకిల్ తొక్కి ఆరోగ్యం కాపాడుకోండి

ప్రజలు సైకిల్ తొక్కి వారి ఆరోగ్యం కాపాడుకోవాలనే సంకల్పంతో, ఆధ్యాత్మికతను పెంపొందించుట కోసం ఈ యాత్ర చేపట్టాం. ఇంటి నుంచి కార్యాలయంకు వెళ్లాల్సి వస్తే కూడా సైకిల్‌పై వెళ్లండి. కనీసం వారంలో రెండు రోజులైనా ప్రయత్నం చేస్తే మనలో ఉత్సాహం వస్తుంది. పెట్రోల్, డీజిల్ ఆదాతో పాటు ఇతర దేశాల నుంచి దిగుమతులు కూడా తగ్గించుకోవచ్చు. యువకులు తప్పకుండా సైకిల్ ఉపయోగించాలి.

– కల్నల్ శివనారాయణ మిశ్ర, నాసిక్

అదుపుతప్పి లారీ బోల్తా

కొత్తకోట రూరల్: అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలం అమడబాకుల సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బెంగళూర్ నుంచి మైదపిండి లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ అమడబాకుల సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. లారీ తక్కువ స్పీడ్‌తో ఉండటంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు



కారులో నుంచి లక్ష్మిని బయటకు తీస్తున్న స్థానికులు

కొత్తకోట రూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన తల్లీ కుమారుడు లక్ష్మి, ఎన్‌వీవీ రెడ్డిలు శుక్రవారం తిరుపతి నుంచి కారులో వస్తుండగా.. కొత్తకోట మండలం పాలెం ఎన్‌హెచ్–44పై అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు.. కారులో ఇరుక్కుపోయిన తల్లీ కుమారుడిని బయటకు తీసి 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: రోడ్డు పనులు చేస్తున్న ఇద్దరు కూలీలను కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహమ్మదాబాద్ మండలం నంచర్ల గేట్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన సోను, అమొజ్‌లు నంచర్ల గేట్ సమీపంలో రోడ్డు పనులు చేస్తుండగా.. వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఇద్దరు కూలీలను ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా కూలీలను ఢీకొట్టిన కారు మొకర్లాబాద్ నుంచి చౌదర్‌పల్లి మీదుగా తప్పించుకుని వెళ్లినట్లు ఆయా గ్రామాల ప్రజలు పోలీసులకు సమాచారమిచ్చారు. విచారణ చేపట్టి కారు డ్రైవర్, యజమానిపై చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

లింగాల ఎస్‌ఐపై కేసు నమోదు

లింగాల: భూవివాదంలో ఆక్రమణదారుల పక్షాన నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల ఎస్‌ఐపై కేసు నమోదయ్యింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ వివరాల మేరకు.. లింగాల మండలం మల్లోనిచెర్వుతండాకు చెందిన కోడెల తిరుపతమ్మ భూమిని అదే తండాకు చెందిన నలుగురు ఆక్రమించుకున్నారు. సదరు మహిళ తన భూమిని తనకు ఇవ్వాలని అడగ్గా.. ఆక్రమణదారులు బెదిరింపులకు గురిచేయడంతో ఆగస్టు 26న లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆమెకు పరాభావం ఎదురైంది. చివరకు ఎస్‌ఐ కూడా దురుసుగా మాట్లాడి కేసును నీరుగార్చే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో తిరుపతమ్మ అచ్చంపేట కోర్టును ఆశ్రయించింది. కోర్టులో పూర్తిస్థాయి విచారణ అనంతరం ఎస్‌ఐతో పాటు నలుగురు ఆక్రమణదారులపై 166, 166–ఏ తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని మెజిస్ట్రేట్ ఆదేశించినట్లు న్యాయవాది ప్రశాంత్ తెలిపారు.

తాను చనిపోతూ.. ఆరుగురికి పునర్జన్మ

- బైక్ పై నుంచి పడిన యువకుడు
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు దానం



నక్కల రాముడు (ఫైల్)

కొత్తకోట రూరల్: పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు చూపిన ఔదార్యం ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన తన కుమారుడి అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచింది ఆ తల్లి. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన నక్కల గోకరయ్య, అలివేలమ్మ కుమారుడు నక్కల రాముడు (20) ప్లంబర్ పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. ఈనెల 13న వనపర్తి మండలం కడుకుంట్లలో గల తన సోదరి ఇంటికి బైక్‌పై వెళ్లిన అతడు.. అదే రోజు స్వగ్రామానికి బయల్దేరాడు. రాయిణిపేట స్టేజీ సమీపంలోని ఎన్‌హెచ్–44పైకి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడటంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి అతడిని తరలించగా.. రెండు రోజుల పాటు డాక్టర్లు చికిత్స అందించారు. ఈ క్రమంలో రాముడు బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు కుటుంబ సభ్యులకు చెప్పారు. అతడి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి, ఆరుగురికి పునర్జన్మ ప్రసాదించారు. కాగా రాముడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాలీబాల్ విజేత 'పాలమూరు'



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలో మూడురోజులుగా కొనసాగిన రాష్ట్రస్థాయి 67వ ఎస్‌జీఎఫ్ అండర్–14 వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో ఉమ్మడి పాలమూరు జట్టు విజేతగా నిలిచింది. వరంగల్ జిల్లా రెండోస్థానంతో సరిపెట్టుకుంది. అదేవిధంగా బాలికల విభాగంలో నిజామాబాద్ ప్రథమ, మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచింది. పాలమూరు జట్టు మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రీడలకు పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వగా రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల జట్లు నాలుగు కోర్టులను ఏర్పాటు చేసి బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతికుమార్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీల్లో ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, క్రీడాకారులు వాలీబాల్‌ను ఎంపిక చేసుకోవడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువులు, ఉద్యోగాల సాధనలో అవకాశాలు మెండుగా ఉంటాయని వివరించారు. అదేవిధంగా చక్కటి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పరిశీలకులు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో చెన్నవీరయ్య, రమేష్‌బాబు, డీవైఎస్‌ఓ వెంకటేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, కౌన్సిలర్లు సలీం, మహేష్, లయన్ సభ్యులు బాలాజీ ఎక్సోటే, రవికుమార్‌గౌడ్, జనార్దన్ మొల్గాన్, బీజేపీ నాయకులు రతంగ్‌పాండురెడ్డి, పీఈటీలు వెంకటప్ప, సాయినాథ్, రాజేష్, కతలప్ప, శ్రీధర్, బాలరాజు, పర్వీన్‌బేగం, కృష్ణవేణి, రాజేశ్వరి, రాధిక, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తాం: ఆర్‌ఎం



ఫోన్‌లో ఫిర్యాదులు తీసుకుంటున్న ఆర్‌ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎంకు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి సంబంధించిన ఫిర్యాదులు తీసుకున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులకు జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద హాల్ట్ ఏర్పాటు చేయాలని, శంకరపల్లి నుంచి కేశంపేట వరకు బస్సు నడపాలని, బస్సుల్లో పీహెచ్‌సీ సీట్లపై కండక్టర్లకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో కోరారు. మహబూబ్‌నగర్ నుంచి మణికొండ వరకు బస్సు నడపాలని, జడ్చర్ల రూట్ నుంచి నాగర్‌కర్నూల్, వనపర్తికి పల్లె వెలుగు బస్సులు, మహబూబ్‌నగర్ నుంచి గుల్బర్గా, మంత్రాలయం, రాజమండ్రి, అన్నవరం, బాసర, రుద్రారం వరకు బస్సులు నడపాలని, వనపర్తి నుంచి దేవరకద్ర వయా కొత్తకోట, పాన్గల్, జీన్గురాల, డోకూర్ వరకు నడిచే బస్సును పునరుద్ధరించాలని కోరారు. మహబూబ్‌నగర్ నుంచి అభంగపట్నం మీదుగా లింగంపల్లి వరకు బస్సు నడపాలని, మహబూబ్‌నగర్‌లో సిటీ బస్సులు నడపాలని, అలంపూర్ ఎక్స్‌రోడ్ నుంచి అలంపూర్ వరకు షటిల్ బస్సులను పెంచాలని, మహబూబ్‌నగర్ నుంచి మద్దూరు మీదుగా వింజమూర్, బూనేడ్ వరకు బస్సు నడపాలని ప్రయాణికులు ఫోన్‌లో ఆర్‌ఎంను కోరారు.